# ఆకలి

—మల్లాది వెంకటకృష్ణమూర్తి

ఆ రోజు ఆదివారం.

సాయంత్రం అయిదవుతోంది.

ధన కోటి, ధనకోటి ఏడేళ్ళ కొడుకు సికింద్రాబాదులో గాంధీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఓ చోట రోడ్డు ప్రక్కన ఆగారు.

"ఈకడానే ఉంది రా. దించు." అన్నాడు ధనకోటి. ధనకోటి ఏడేళ్ళ కొడుకు తన నెత్తిమీద ఉన్న రెండు బుట్టలను జాగ్రత్తగా క్రిందికి దించాడు: ధనకోటి వేలం మీద గొంతుక కూర్చున్నాడు. ప్రక్కనే ధనకోటి కొడుకు చేతిలో నాగస్వరంతో కూర్చున్నాడు.

ధనకోటి ఆ రెండు పాము బుట్టలను సర్ది చేతిలోని సంచిలోంచి కొన్ని మూలికలు తీసి రోడ్డుమీద వరసగా పేర్చాడు. మైనం సంచిలోంచి జాగ్రత్తగా కొన్ని నల్లటి బిళ్ళలలాంటి నిగనిగ మెరిసే రాళ్ళను తీసి ఓ కాగితం మీద పోసి – ఆ కాగితాన్ని బుట్ట ప్రక్కనే పెట్టాడు.

తర్వాత మరో సంచీలోంచి పాము చర్మాలను అయిదారిటిని తీసి రోడ్డుమీద చతురస్రాకారంలో పేర్చాడు ధనకోటి కొడుకు చుట్టు ప్రక్కల కూర్చొని అడుక్కొంటున్న కుష్టు రోగులవంక చూడ సాగాడు.

"ఏందిరా చూస్తవ్?" అని కసిరాడు ధనకోటి కొడుకుని. వాడు వెంటనే నాగస్వరం ఊదనారంభించాడు.

ఒక సత్తు బొచ్చె తీసి ఆ పాము చర్మాల మధ్య వుంచి, సీసాలోంచి ఆ బొచ్చెలోకి నీళ్ళు వంపాడు ధనకోటి. మరో నాగస్వరం తాను అందుకొని వూద సాగాడు.

ఆదివారం కాబట్టి జన సమ్మర్దంగా వుంది రోడ్డంతా చేతిలో సంచీలతో మోండా మార్కెట్ వైపు నడుస్తున్న వాళ్ళు కొన్ని క్షణాలు ఆగి, అ పాము చర్మాల వంకా, మూలికల వంక చూసి వెళ్తున్నారు. ఉత్సాహం వున్నవాళ్ళు కొందరు ప్రక్కనే నిలబడి చూడ సాగారు.

ఇంకా జనం ఎక్కువగా చేరనందువల్ల ధనకోటి వూదటం ఆపి, "రండి సార్, చూడండి. జాతి పాములని చూడండి. పాముల విషాలకి విరుగుడు మందులు చూడండి" అని కాసేపు అరిచాడు:

అతని చుట్టు దాదాపు పాతిక మంది దాకా పిన్నా, పెద్దా చేరారు. చేరేదాక ఆగి...

ధనకోటి ఒక బుట్ట కొద్దిగా తెరచాడు. లోపల చుట్ట చుట్టుకొని వున్న పాము నిద్ర పోతోంది. కుడి చేత్తో దాని మీద పొడిచాడు. అది వెంటనే లేచింది బుస్సుమంటూ, పడగ విప్పి.

ఇద్దరు చిన్న పిల్లలు, ఒకరిద్దరు పెద్దవాళ్ళు కూడా అప్రయత్నంగా ఒకడుగు వెనక్కు వేసారు – భయంగా.

కొన్ని క్షణాల తర్వాత అది మళ్ళీ పడగ ముడుచుకుని బుట్టలోని కెళ్ళిపోయింది.

"ఇది నల్ల త్రాచు. నాలుగు రోజులయింది పట్టుకొని దీన్ని వుప్పల్‌లో ఒక ఫేక్టరీ కాడ పట్టుకొన్నాను. ఇంకా చిన్న పిల్లే ఇది." దాని చరిత్ర చెప్పాడు.

రెండో బుట్టమీద చేయివేసి అన్నాడు. "దీంట్లో వుంది నాగసర్పం. మహా విషం గల పాం ఇది. వరంగల్‌లో మొలుగు రోడ్డుమీద చిక్కింది ఇది వారం క్రితం. మాది వరంగల్ దగ్గర ఓపల్లె. నా పేరు ధనకోటి. వరంగల్ కెళ్ళి వచ్చి అయిదు రోజులయింప".

బుట్ట తెరచాడు. లోపలనుంచి వెంటనే లేచింది గోధుమరంగుతో నిగనిగలాడే పాము, చాలా పెద్ద పాము అది. కనీసం నాలుగడుగులయినా వుంటుంది. చురుగ్గా అటూ ఇటూ త్రిప్పింది దోసిలిపరిమాణంలో వున్న పడగని.

"చూడండి సార్, నాగజాతి పాము ఇది. ఇంకా కోరలు తీయలేదు. దీని కాటుకు తిరుగుండదు. పెద్ద పెద్ద డాక్టర్ల దగ్గరకూడా. సినిమాలో వేషాలేసే పాము లిలాగే వుంటాయి".

వెంటనే దాని పడగమీద బుట్ట మూతపెట్టి దాన్ని బుట్టలోకి అదిమేసి మూతపెట్టేసాడు ధనకోటి.

ఒసారి అందరివంకా పరిశీలనగా చూసి చెప్పాడు.

"సికింద్రాబాదు, హైదరాబాదులలో వుండేటోళ్ళు మీరంతా. ఇక్కడ అట్టే పాములుండవు. కాని మీలో ఎవరైనా పల్లెటూళ్ళకెళ్ళే వాళ్ళుంటే జాగ్రత్తగా చూసుకెళ్ళాలి. ఆడ పాములు మస్తుగ వుంటాయ్. పొరపాటున పాముమీద కాలేస్తిరా, కస్సుమని కాటేసి జరజర పారిపోతాయ్. నెత్తిమీద వెంటనే పెద్ద బండ పెట్టుకొని, డాక్టర్ దగ్గరకెళ్ళి, సూది మందేయించుకున్నాక గాని ఆ బండ దింపకూడదు. మధ్యలో దింపేస్తే, కాలులోంచి విషం రగతంలోకి జరజర నెత్తిమీదదాకా ఎక్కుద్ది. నోట్లోంచి నురగి లెల్తాయ్, కూలిపోతరు. ఒళ్ళంతా నీలం కమ్ముద్ది. దాహం వేస్తప, కళ్ళుబోతాయ్, నరాలు పీకుతాయ్. అలా ఓ గంటో, రెండుగంటలో బాధపడ్డాక చచ్చి పోతరు" ఎంతో గంభీరంగా, చక్కటి మాడ్యులేషన్‌తో, ఇమోషన్‌తో చెప్పాడు ధనకోటి.

ఆ బుట్టవైపు యిద్దరు, ముగ్గురు పిల్లలు భయంగా చూసారు.

"మేం కొండజాతోళ్ళం. కొండల్లో, వనాల్లో తిరిగేటోళ్ళం. మా జీవనమే వీటిని పట్టుకోడం. వీటిని ఆట్కాయించి, జీవనం గడుపుకునేటోళ్ళం. మిమ్మల్ని యింతసేపు యిక్కడ ఆపింది ఈ నోరు లేని వాటిని గూర్చి ఇసదం చేయడానికే. నోరులేక పోయినా కోరలున్నయ్. మన మనుషులికి నోరూ వుంటంది, కోరలూ వుంటయ్. కాని, ఈటికి నోరుండదు, కోరలే ఉంటాయి. మన మనుషుల్లో కొందరికి పగుండదు. వీటికి పగుంటది, ఇసప్పురుగులు, వాసనబట్టి వెంటాడుతాయ్. ఏరుదాటితే ఏం చేయలేవ్ గాని, ఏరుదాటకుండా ఏ సీమలో వున్నా మహ డేంజర్ వీటితో."

ఉపన్యాసధోరణిలో కొనసాగించాడు ఆ తర్వాతి మాటలు యాంత్రికంగా, వేర్లని, మూలికలని తీసి అందరికీ చూపిస్తూ.

''పాములు మనకి మంచిస్నేహితులు. పొలాల్లో బడి జొన్న, మొక్కజొన్న, రాగులు, కందులు, ఒకటేమిటి, సమస్తాన్ని దొంగతనంగా మేసే ఎలుకలని చంపుకుతింటాయ్. ఈ పాములకి రోజుకి రెండెలుకలు కూడెట్టాలా, మాకు కూడు దొరికినా, దొరక్క పోయినా, పాలుపోస్తే తాగవ్. మాంసం కావాల వీటికి, మేం బన్‌ముక్క, చాయ్ నీళ్ళతో బ్రతికినా, వీటి కడుపునిండాకే మేం తినాల. లేకపోతే మామీద పగబడతాయ్ మమ్మల్ని సర్వ నాశనం చేస్తయ్."

చుట్టు ప్రక్కల చేరిన మనుష్యులలో కొందరు వెళ్ళిపోతున్నారు. కొందరు కొత్తవాళ్ళు ఆసక్తిగా అగి

చూస్తున్నారు. పాతికమందికంటె ఎక్కువవుండటం లేదు ఎప్పుడూ.

"ఒక్కోసారి ఇవి మన ఇళ్ళల్లో కూడా జొరబడతాయ్. రెండ్రోజుల క్రితం సీతాఫల్‌మండిలో రైలు కట్ట ప్రక్కనే వున్న ఓ ఇంట్లోకి జొరబడిందీ పాము. ఉర్కొచ్చి నన్ను పట్టకెళ్ళింర్రు. అది అటకెక్కి కూర్చుంది పాతసామాన్లల్లో. అందుకే పాత సామాను అటక మీదకి జేర్చకూడదు. నా కంట బడ్డది. ఇత్తడి బిందెకి చుట్టుకుని ఉంచె.

పట్టుకోబోతుంటే కాటేసింది."

సస్పెన్స్ కోసమా అన్నట్లుగా ఆగి, కుర్రాడితో ఏదో కాసేపు మాట్లాడాడు. ఆ గుంపులో ఓ పిల్లాడు అడిగాడు వుత్సాహం ఆపుకోలేక ధనకోటిని.

"కాటేస్తే ? డాక్టరు దగ్గర కెళ్లావా ?"

ఆ ప్రశ్న కోసమే ఎదురు చూస్తున్న ధనకోటి చెప్పసాగాడు.

"నాకాడ పాం విషం విరుగుడుంది. ఇప్పుడది మీకు చూపిస్తాను. అది కాటేసిన చోట అదిమిపెడితే రగతంలోంచి విషాన్ని విరిచేసి లాగేస్తుంది బయటికి. ప్రతీ ఒక్కరూ ఒకటి ఎప్పుడూ దగ్గరుంచుకోవడం ఎంతో అవసరం."

ఆ మూలికలలోంచి నాలుగయిదు చేతిలోకి తీసికొని, వాటిపేర్లు, అడవుల్లో అవి ఎలాంటి చోట లభ్యమవుతాయి. వాటిని సంపాదించటానికి తను ఎంత శ్రమ పడిందీ, వాటి గుణ విశేషాలు ఓ పావుగంట సేపు వివరించాడు.

"వీటన్నిటినీ కలిపి మందు బిళ్ళలు తయారు చేసాను. అవే యివి"

కాగితం మీద పరిచి పెట్టిన నల్లటి బిళ్ళలను చేతిలోకి తీసికొని అందరికీ చూపించాడు.

ఆ మూలికలన్నీ కలిపి, నూరి, రసం పిండి తులసాకుతో కలిపి, ఏడు పగళ్లు, ఏడు రాత్రుళ్లు ఆరబెడితే ఇలా అవుతాయి. పాము కానీ, తేలుకానీ, జర్రికానీ, ఇంకేదయిన విషప్పురుగు కానీ కరిస్తే, ఆ కరిచినచోట దీన్ని వుంచేయాలి. అలాగే ఆ గాయానికి అతుక్కుపోతుంది ఓ అరగంటదాకా. విషం పీల్చేస్తుందన్నమాట రగితంలోంచి. పూర్తిగా విషం పీల్చేయగానే దానంతట అదే కింద పడిపోతుంది."

ఆసక్తిగా చూస్తున్నారంతా.

"ఇది కింద పడిపోగానే ఆ మనిషి బ్రతికాడన్నమాటే. పూర్తిగా నీలిరంగులోకి వచ్చేస్తుంది, కింద బడ్డ ఈ గోళీ. దీన్ని వెంటనే నీళ్ళలో వేస్తే, ఇది పట్టుకొన్న విషమంతా ఆ నీళ్ళల్లో కరిగిపోయి మళ్ళీ యిది యిలా నల్ల రంగులోకి మారుతుంది.

''ఈ మందు తర్వాత పనికి రాదా?'' అడిగారెవరో.

''పని కొస్తుంది. ఇలా ఎన్ని సార్లయినా ఉపయోగించుకో వచ్చు దీన్ని. భద్రంగా ఏదయినా భరిణలో పెట్టి దాచుకోవాలి. ఎప్పుడూ దగ్గరుండాలంటే, దీన్ని మొలతాడుకు గుచ్చుకోవచ్చు. మీరంతట మీరు వనాలకెళ్ళి, వీటిని వెదికి బట్టుకొని, ఇవి చేయాలంటే చాలా డబ్బు ఖర్చు అవుతుంది. వీటి మీదే మా జీవనం కాబట్టి మాకు అలవాటే ఇవి చేయడం''.

మరో సారి ఆ బుట్టను తెరిచాడు. అందులోంచి గోధుమ రంగు త్రాచు బుసకొడుతూ బయటికి లేచింది. చేతిలో తయారుగా వుంచుకున్న ఆ నల్లటి గుళికను దాని పడగ దగ్గర వుంచాడు ధనకోటి. వెంటనే ఆ గోధుమ వన్నె సర్పం పడగ ముడి చేసింది.

సగర్వంగా చూసాడు చుట్టు ప్రక్కల నించొని ఆసక్తిగా చూస్తున్న జనం వంక. ''మరోసారి చూడండి'' అన్నాడు. మళ్ళీ యథా ప్రకారం చేసాడు. ఆ పాము పడగ ముడిచేసింది ఆ నల్లటి గుళిక పడగ దగ్గరకు చేరగానే.

''ఇందులో మాయలేదు. మంత్రం లేదు. మహత్తు లేదు. మందు వుంది అంతే. పగ పట్టిన పాముమీద కొచ్చి కరిచినా యీ మందుతో బ్రతికి పోవచ్చు. ఇప్పుడు నగరాల్లో పాములుండవు కాని, పూర్వ కాలంలో పాములు లేని చోటుండేది కాదు. ఆ కాలంలో ప్రజలు ఇవి పుచ్చుకుని తిరిగే వారు చీకట్లో పొరు గూరి కెళ్ళాలంటే.

తేలుకరిస్తే వుప్పునీళ్ళు త్రాగితే తగ్గుది విషం. జర్రి కరిస్తే ఒళ్ళంతా భగభగ మండుద్ది. ఈ రెండు పురుగుల విషాలు ఇరవైనాలుగ్గంటలు బాధిస్తాయి. కాని పాము విషం మనిషిని చంపితే కాని వూరుకోదు మీ పేణాల కోసం ఇన్సూరెన్సు చేస్తారు. డాక్టర్లకి ఫీజులిచ్చు కొంటారు. దేముడికి పూజలు, వ్రతాలూ, నోములూ చేస్తుంటారు. మీ పేణాలకోసం ఏటేటో చేసి, ఎంతెంతో ఖర్చు పెడతారు. కాని మాలాం టోళ్ళు రోడ్డు ప్రక్కల కూర్చొని వీటిని అమ్మితే మాత్రం కొనరు. ఇదే మందు ఏ ఇంగ్లీషు డాక్టరో వంద రూపాయిలు చెప్పినా ఇచ్చి కొంటారు. ముందర యీ మందుమీద విశ్వాసం ఉంచండి. ఆ తర్వాత కొన్నా, కొనకపోయినా ఫర్వా లేదు. పాము లాడించి యింటింటికెళ్ళినా బియ్యం దొరుకుద్ది. మందిని మోసంచేసి డబ్బు సంపాదించటం కాదు నా విద్య''.

ఓ సారి అందరి వంక చూసి ధనకోటి మీసం దువ్వుకొన్నాడు.

''పాములని ఇళ్ళలోకి వదిలి పైసలిస్తే కాని పట్టుకెళ్ళం అనేటోళ్ళున్నారు. అలాంటోడిని కాను నేను. కుర్రాడా. పోయినేడాది పాం కరిసిన గురుతు చూపియరా దొరలకి.''

ధనకోటి కొడుకు కుడికాలు చూపి పాదంమీద ఉన్న ఓ నల్లటి మచ్చను చూపించాడు.

''కట్లపాం కరిచింది వీడిని. నా తాన ఈ మందు లేకుంటే ఎప్పుడో యములోళ్ళు లాక్కెళ్ళి ఉండే వారు. దొరల్లార. నేను వరంగల్ కెళ్ళి వచ్చినోడిని. రోజూ మీకు యిక్కడ కనబడను. మీలో పైసలున్న వాళ్ళు ఈ మందును కొనుక్కోండి. అయిదు రూపా యలు ఒకొక్కటీ. అయిదంటే అయిదే రూపాయలు. అయిదు రూపాయలతో పాముభయం లేకుండా చేసు కొండి.''

దాదాపు రెండు గంటల సేపు ధనకోటి అలా కబుర్లు చెప్తూ కూర్చున్నాడు అక్కడ. చీకటి పడ సాగింది. ఏవరూ ఆ మందు కొనలేదు.

''అయ్యో! ఈ వేళ కూడా పైసలు జమవలేదు.'' అన్నాడు ధనకోటి కొడుకు విచారంగా.

ధనకోటి మాట్లాడ లేదు. మౌనంగా సామాను సర్దసాగాడు. మూడు రోజులనుంచి బన్, టీ తప్ప భోజనం చేయలేదు వాళ్ళు. ఆకలితో నకనక లాడు తున్నాయ్ వాళ్ళిద్దరి కడుపులు.

''వరంగల్ అయితే పైసలొచ్చేవి'' అన్నాడు కుర్రాడు.

''ఛూ. కుష్ఠోళ్ళకి పైసలేస్తరు గాని పాములోడికి వెయ్యరు. ఇంటికెళితే గుప్పెడు బియ్యం పెట్టరు ఇవాళ రేపు.''

ధనకోటి, కుర్రాడు మౌనంగా ఎవరి ఆలోచన లతో వాళ్ళు నడవసాగారు. క్లాక్ టవర్, రాష్ట్రపతి

రోడ్ దాటి పెరేడ్ గ్రౌండ్స్‌కి అవతల వున్న ఖాళీ స్థలం చేరుకున్నారు అరగంట తర్వాత.

అక్కడ చాలా మంది లంబాడీలు గుడిసెలు కట్టుకుని జీవిస్తున్నారు. ధనకోటి ఓ గుడిసెలోకి వెళ్ళి బుట్టలని దింపాడు. వాడి కొడుకు ఓ లంబాడీ వాళ్ళ కొడుకుతో ఆడుకోడానికి పరిగెత్తాడు అంత నీరసంలోనూ.

ధనకోటి మోకాళ్ళ మీద దిగులుగా కూర్చున్నాడు.

దాదాపు గంట తర్వాత ధనకోటి గొంతెత్తి పిల్చాడు కొడుకుని.

"ఇంకాస్సేపు ఆడుకునొస్తా అయ్యా" అన్నాడు వాడు.

"కూడు తిని వెళ్ళు".

సొట్టలు పడ్డ ఓ సత్తు బొచ్చె అందించాడు. నాలుగయిదు ముక్కలు తిని అడిగాడు "బావుంది. ఏడది?"

ధనకోటి మీద పడ్డాయి అతని కొడుకు చూపులు.

"నాగ దొరా. నువ్వే నన్ను చమించాల. ఆకలి నన్ను తినేస్తుంటే నేను నిన్ను తింటున్నాను." కళ్ళలో నిండిన నీటి పొరతో, వుడకబెట్టి వుప్పూ, కారం, వుల్లిపాయ ముక్కలు కలిపిన మాంసం ముక్కలు తినసాగాడు ధనకోటి నెమ్మదిగా

గోధుమ రంగు పాము చర్మం ఆ గుడిసెలో ఓ మూల వేలాడుతోంది. మూత బెట్టిన గిన్నెలోంచి చర్మంలేని ఆ పాముతోక బయటికి కనబడుతోంది. ఆ సగం వాళ్ళ మర్నాటి భోజనం.

ప్రపంచంలోని అతిలోతైన - అత్యాధునికమైన
రేవుల శ్రేణిలోని రేవు
విశాఖపట్నం రేవు

విశాఖపట్నం పోర్టు ట్రస్టు